సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం : 30 : ఆగస్టు : 2024

రేపు జాబ్ మేళా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాలకోసం ఈ నెల 31న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పనశాఖ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు మేళా ప్రారంభం కానుందని. పదో తరగతి, ఆపై అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎంబీబీఎస్ ప్రవేశాల గడువు పెంపు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి గడువును పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు ఈనెల 29 వరకు గడువు ఉండగా 31 వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కోటా కింద 15 సీట్లు కేటాయించినట్లు తెలిపారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
29.3/24.2

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అత్యుత్తమ సాంకేతికతతో సేవలు

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ వినియోగదారులకు అత్యుత్తమ సాంకేతికతతో సేవలు అందిస్తున్నామని ఎస్ఈ జేఆర్ చౌహాన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సిస్టమ్ ఎవరేజ్ ఇంటరప్షన్ డ్యూరేషన్ ఇండెక్స్ (సైది), సిస్టమ్ ఎవరేజ్ ఇంటరప్షన్ (సైఫీ) ద్వారా అంతరాయాలకు కొలమానంగా తీసుకుంటున్నామని, వినియోగదారులకు సగటున ఎన్నిసార్లు అంతరాయం జరిగిందో క్రోఢీకరిస్తున్నామన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయడానికి స్టోర్ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. బిల్లింగ్, కలెక్షన్ అంతరాయాలు, ఫిర్యాదుల వివరాలు కమాండ్ కంట్రోల్ మాదిరి ఒకేచోట పూర్తి సమాచారాన్ని తెలుసుకునేలా ఏర్పాటు చేస్తామన్నారు. వర్షాలు, ఈదురు గాలులు, సాంకేతిక సరఫరాలో సమస్యలు తలెత్తినప్పుడు ప్రత్యామ్నాయంగా సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఐకేపీ వీవోఏల ధర్నా



ధర్నా చేస్తున్న వీవోఏలు

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఐకేపీ వీవోఏలు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ హామీ మేరకు తమకు రూ.26వేల కనీస వేతనం అమలు చేయాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఉద్యోగ భద్రతను కల్పించాలని, రూ.10 లక్షల సాధారణ బీమాతో పాటు ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు రాజేశ్, దత్తు, రాజు, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

కైలాస్‌నగర్: రైతులకు రూ.2లక్షల రుణాలను బేషరతుగా మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు భరోసా నిధులు జమచేయకపోవడంతో రైతులకు తగిన సమయంలో పెట్టుబడి సాయం అందక మధ్య దళారులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. రెండు లక్షల్లోపు రుణాలు మాఫీ కాని రైతులందరికీ రుణా లు అందించాలన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు.

మున్సిపల్ డీఈగా కార్తీక్ బాధ్యతల స్వీకరణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగానికి మరో అధికారి నియామకమయ్యారు. హైదరాబాద్ జీహెచ్‌ఎంసీలో డీఈగా పనిచేస్తున్న కార్తీక్‌ను ప్రభుత్వం ఆదిలాబాద్ మున్సిపాలిటీకి బదిలీ చేసింది. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, కమిషనర్ ఖమర్ అహ్మద్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు.

మూడు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని 18 మండలాల్లో ఒకరు రెగ్యులర్ ఎంఈవోగా ఉండగా మిగితా మండలాలకు సీనియర్ ప్రధానోపాధ్యాయులే ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఇంద్రవెల్లి, తలమడుగు, గుడిహత్నూర్ మండలాల ఇన్‌చార్జి ఎంఈవోలు ఉద్యోగ విరమణ పొందనున్నారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రస్తుతం ఆదిలాబాద్‌అర్బన్, రూరల్, మావల మండలాల ఎంఈవో సోమయ్యకు తలమడుగు మండల అదనపు బాధ్యతలు, ఇచ్చోడ, సిరికొండ మండలాల ఇన్‌చార్జి ఎంఈవో ఉదయ్‌రావుకు గుడిహత్నూర్ మండల అదనపు బాధ్యతలు కేటాయించారు. గాదిగూడ, నార్నూర్ మండల ఇన్‌చార్జి ఎంఈవో ఆశన్నకు ఇంద్రవెల్లి మండల ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు సెప్టెంబర్ 1న బాధ్యతలు చేపట్టనున్నారు.

స్థానిక రిజర్వేషన్లపై సందిగ్ధం

- అయోమయంలో ఆశావహులు
- ప్రారంభమైన 'పంచాయతీ' కసరత్తు
- రిజర్వేషన్ల మార్పునకు ప్రభుత్వ యోచన

2019 పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల వివరాలు
షెడ్యూల్ ఏరియాలో...
మహిళా రిజర్వేషన్లు : 124 జీపీలు
జనరల్ రిజర్వేషన్లు : 124
వందశాతం ఎస్టీ జనాభా కలిగిన గ్రామాల్లో
మహిళలకు : 07
జనరల్ : 07

నాన్ షెడ్యూల్ ఏరియాలో...

ఎస్టీ మహిళలు15	ఎస్టీ జనరల్ 15
ఎస్సీ మహిళలు13	ఎస్సీ జనరల్ 12
బీసీ మహిళలు 24	బీసీ జనరల్ 23
జనరల్ మహిళలు 51	జనరల్ 52



మావల గ్రామ ముఖచిత్రం

కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీ ఎన్నికల కసరత్తు ప్రారంభమైంది. పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు వార్డుల వారీగా ఓటర్ల జాబితా, వార్డుల విభజనలో నిమగ్నమయ్యారు. దీంతో పల్లెల్లో ఎన్నికల సందడి నెలకొంది. అయితే రిజర్వేషన్లపై మాత్రం ఇంకా సందిగ్ధం వీడటం లేదు. దీంతో ఎన్నికలను పాత రిజర్వేషన్ల ప్రకారం నిర్వహిస్తారా? లేక రిజర్వేషన్లను మార్చి కొత్త వాటి ప్రకారంగా ఎన్నికలు జరుపుతారా? అనేదానిపై ప్రభుత్వం స్పష్టత నివ్వడం లేదు. దీంతో పంచాయతీ పోరుకు సై అంటున్న ఆశావాహులు రిజర్వేషన్లు తేలక అయోమయంలో పడిపోయారు. ఇదిలా ఉంటే బీసీ కమిషన్‌కు త్వరలోనే పాలకమండలిని నియమించి, బీసీ రిజర్వేషన్లను ఖరారు చేశాకే ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తామని ప్రకటించడంతో కొత్త రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు జరిగే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రిజర్వేషన్లు మారేనా?

ఓవైపు ఓటరు జాబితా తయారీ ప్రక్రియ ముమ్మరంగా సాగుతుండగా రిజర్వేషన్లపై స్పష్టత రాకపోవడం ఆశావాహులను కలవరానికి గురిచేస్తోంది. పంచాయతీ ఎన్నికల కసరత్తును ప్రారంభించిన ఈసీ రిజర్వేషన్లపై మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. 2019 ఎన్నికలకు ముందు పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవే రిజర్వేషన్లు పదేళ్లపాటు కొనసాగించేలా ప్రత్యేక చట్టం చేసింది. గతంలో పోటీ చేసిన అభ్యర్థులు మరోసారి తమదే రిజర్వేషన్ అనుకుని మరోసారి పోటీ చేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. పంచాయతీ పాలకవర్గాల గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 1తో ముగిసింది. అయితే కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి ఎన్నికలను నిర్వహించలేదు. ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించనట్లేతే కేంద్రం నుంచి పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచి పోయే అవకాశముంది. ఈ నేపథ్యంలోనే పంచాయతీ పోరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినఈసీ ఓటర్ల జాబి తా తయారీకి ఆదేశాలిచ్చింది. అయితే రిజర్వేషన్లపై మాత్రం ఈసీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో అయోమయ పరిస్థితి నెలకొంది.

కొత్త రిజర్వేషన్ల ప్రకారమేనా?

త్వరలోనే బీసీ కమిషన్‌కు పాలకమండలిని నియమించి, దాని ద్వారా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల మార్పు ఖాయమనే చర్చ రాజకీయాల్లో జోరుగా సాగుతోంది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఆలస్యం కాగా బీసీ కమిషన్ నియామకం, బీసీ రిజర్వేషన్ల ఖరారుకు మరింత సమయం పట్టే అవకాశమున్నందువల్ల ఎన్నికల నిర్వహణ ఆలస్యమయ్యే అవకాశం కన్పిస్తోంది. అయితే పంచాయతీ ఎన్నికలను నాలుగు నెలల్లోపే పూర్తి చేస్తామని ఎస్ఈసీ పార్థసారథి గురువారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రకటించడం చూస్తుంటే పంచాయతీ ఎన్నికలు నవంబర్, డిసెంబర్‌లో జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కొత్త రిజర్వేషన్ల ప్రకారంగానే ఎన్నికలు జరుగనున్నాయనే అభిప్రాయం రాజకీయవర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

ఓటరు జాబితా రూపకల్పనలో పంచాయతీ కార్యదర్శులు బిజీ



మామడ మండలంలోని వాఘాపూర్‌లో ఓటరు జాబితా సవరణలో నిమగ్నమైన కార్యదర్శి

ఈ ఏడాది ఫిబ్రవరి 20న ప్రకటించిన పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగా పంచాయతీ ఓటర్ల జాబితాను రూపొందించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఆ జాబితాలను జిల్లాకు పంపించింది. వాటిని తీసుకున్న పంచాయతీ కార్యదర్శులు (బీఎల్‌ఓ)లు అంగన్‌వాడీ టీచర్ల సాయంతో ఓటర్ల జాబితా, వార్డుల విభజన ప్రక్రియ చేపడుతున్నారు. ఒక కుటుంబంలోని ఓటర్లంతా ఒకే వార్డులో ఉండేలా, ఒక వార్డులో నివాసముంటూ మరో వార్డులో ఓటు ఉన్నట్లైతే వారి వివరాలను నివసించే వార్డులో ఉండేలా ఓటర్ల జాబితాలను రూపొందిస్తున్నారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓటర్లను ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్చుతున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా పంచాయతీ కార్యదర్శులంతా బిజీబిజీగా మారారు.

మాకు సమాచారం లేదు

పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా తయారీపై ఈసీ ఆదేశాలు జారీ చేసింది. వాటి ప్రకారం జిల్లాలోని 468 జీపీల్లో వార్డుల వారీగా ఓటర్లు, వార్డుల విభజన ప్రక్రియ చేపడుతున్నాం. ఒకే కుటుంబం, ఒక వార్డులోని ఓటర్లందర్నీ అదే వార్డులో కొనసాగించేలా జాబితా సిద్ధం చేస్తున్నాం. అయితే పంచాయతీ రిజర్వేషన్లపై మాత్రం ప్రభుత్వం నుంచి కానీ, ఈసీ నుంచి కానీ మాకెలాంటి ఆదేశాలు అందలేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకెళ్తాం.

– ఎస్.శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి

వైద్యుల భద్రతకు ప్రత్యేక చర్యలు

- ఎస్పీ గౌస్ ఆలం



సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో వైద్యులు, మెడికోల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపడతామని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. గురువారం రిమ్స్ మెడికల్ కళాశాలతో పాటు వసతిగృహాన్ని పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజీల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పనిచేయని సీసీ కెమెరాలకు వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన సంఘటనపై రిమ్స్ సెక్యూరిటీ గార్డులతో సమావేశం ఏర్పాటు చేశారు. రిమ్స్ ఆస్పత్రిలో ఎక్కడైనా గొడవ జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రిమ్స్‌లో రెండు షిఫ్టుల్లో ముగ్గురు చొప్పున పోలీసులను నియమించడం జరుగుతుందన్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. సెక్యూరిటీగార్డులకు వచ్చే వారంలో శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థుల భద్రత ముఖ్యమని, రాత్రి వేళల్లో వసతిగృహం వైపు గుర్తు తెలియని వ్యక్తులను వెళ్లనివ్వొద్దన్నారు. రాత్రి వేళల్లో చేతిలో లాఠీ, టార్చ్‌లైట్ వెంట ఉంచుకుని రిమ్స్ ప్రాంతాలను కలియ తిరగాలన్నారు. ఎస్పీ వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, అడిషనల్ ఎస్పీ సురేందర్ రావు, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

ఆదిలాబాద్‌టౌన్: తోటి విద్యార్థులతో ర్యాగింగ్‌కు పాల్పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. గురువారం రిమ్స్ ఆడిటోరియంలో యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్, సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కొన్ని మెడికల్ కళాశాలల్లో జూనియర్లను సీనియర్ విద్యార్థులు వారి క్షణికపాటి ఆనందం కోసం ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. దీంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై పోలీసులకు సమాచారం అందిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు దోచుకునేందుకు కొత్త పుంతలు తొక్కుతున్నారన్నారు. ప్రస్తుతం పోలీసులమని చెప్పి బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. సైబర్‌క్రైమ్ బారిన పడితే 1930కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, సురేందర్‌రెడ్డి, నార్కొటిక్ డీఎస్పీ పద్మనాభం, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విద్యవిల్సన్, సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్ రావు, ఫణీందర్, మావల ఎస్సై విష్ణువర్ధన్, వైద్యులు, మెడికోలు పాల్గొన్నారు.

అతివకు అండగా 'సాక్షి'

- 'మీతో సాక్షి' పోస్టర్ ఆవిష్కరించిన ఎస్పీ గౌస్ ఆలం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ, రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: 'సాక్షి' దినపత్రిక మహిళలకు అండగా నిలవడం సంతోషకరమని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. గురువారం రిమ్స్ డైరెక్టర్ చాంబర్ ఎదుట 'అతివకు అండగా.. మీతో సాక్షి' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికితీస్తున్న దినపత్రిక సామాజిక స్పృహతో మహిళలకు అండగా నిలవడం సంతోషకరమన్నారు. కొంత మంది పోకిరీలు మహిళలు, విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ ఇంటా బయట, పని ప్రదేశాల్లో కొందరు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, సెల్‌ఫోన్‌లలో అసభ్యకర సందేశాలు, ప్రేమ పేరిట ఇబ్బందులకు గురిచేయడం ఇటీవల కాలంలో సర్వసాధారణమైందన్నారు. అలాంటి వారిపై ఫిర్యాదు చేసేందుకు 'సాక్షి' అతివలకు మద్దతుగా నిలుస్తూ వారి సమస్యను పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 8977794588 నంబర్‌కు వాట్సాప్ చేయాలన్నారు. సమస్యలను 'సాక్షి' తెలంగాణ మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్ దృష్టికి తీసుకెళ్లడం సంతోషంగా ఉందన్నారు. భయం వీడి ధైర్యంగా ముందుకు రావాలని, వేధింపుల నుంచి విముక్తి పొందాలని అన్నారు. అనంతరం రిమ్స్ కళాశాల నోటీసు బోర్డుపై కరపత్రాలను అంటించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్‌రావు, మావల ఎస్సై విష్ణువర్ధన్, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ చేయని గురువులు

- రెండు నెలల్లో నాలుగు దరఖాస్తులే
- గడువు సెప్టెంబర్ 15
- విద్యాశాఖ నిర్లక్ష్యంతో ముందుకెళ్లని ప్రక్రియ



ప్రాజెక్టులతో విద్యార్థులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి చర్యలు చేపడుతోంది. విద్యార్థి దశ నుంచే భావితర శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తోంది. అయితే 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని' చందంగా మారింది జిల్లాలోని ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల దరఖాస్తుల ప్రక్రియ. అన్ని యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి పదోతరగతి చదివే విద్యార్థులకు ఏటా ఇన్‌స్పైర్, మనక్, ఇన్నోవేషన్ కార్యక్రమాల పేరిట ఆవిష్కరణలు తయారు చేయిస్తోంది. ఇందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది. విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేసి నూతన ఆవిష్కరణలు తయారు చేసేలా ప్రోత్సహిస్తోంది. అయితే సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించాల్సి ఉండగా గురువులు ముందుకు రాకపోవడంతో దరఖాస్తుల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. జూలై 1నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కాగా ఇప్పటి వరకు కేవలం నాలుగు దరఖాస్తులు మాత్రమే అందాయి. సెప్టెంబర్ 15 వరకు గడువు ఉండగా సర్కారు బడుల్లో చదివే విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తే వారు భావితర శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుంది.

జిల్లాలో 433 పాఠశాలలకు అవకాశం

ఇన్‌స్పైర్–మనక్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఆవిష్కరణలు తయారు చేయవచ్చు. జిల్లాలో మొత్తం 433 పాఠశాలలు పాల్గొనే అవకాశముంది. ఇందులో 188 ప్రాథమికోన్నత, 255 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు. ఒక్కో పాఠశాల నుంచి ఐదుగురు చొప్పున దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న పాఠశాలల్లో ప్రభుత్వం 10 శాతం పాఠశాలలను ఎంపిక చేస్తుంది. ఎంపికైన విద్యార్థి ఖాతాలో రూ.10వేల చొప్పున జమ చేస్తుంది. వీటిలో రూ.5వేలు విద్యార్థుల రవాణా చార్జీల కోసం, మరో రూ.5వేలు విద్యార్థి తయారు చేసే ప్రాజెక్ట్‌కు ఖర్చు చేయాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు.

పట్టించుకోని గురువులు

ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం విద్యార్థులను ప్రోత్సహించి వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా శ్రద్ధ వహించాల్సిన ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదు. చాలా మంది విద్యార్థులకు అసలు ఈ కార్యక్రమం ఉందనే విషయమే తెలియదంటే జిల్లా విద్యాశాఖ పనితీరు ఎలా ఉందో స్పష్టమవుతోంది. ఫిజిక్స్, మ్యాథ్స్ ఉపాధ్యాయుల మధ్య ఇటీవల జరిగిన గొడవల కారణంగా ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ విద్యార్థులకు ప్రయోజనాలు అందకుండా చేస్తున్నారనే విమర్శలున్నాయి. విద్యాశాఖ అధికారులు ఒత్తిడి తెస్తే చివరి సమయంలో ఆదరబాదరగా దరఖాస్తులు చేయడం ఏటా పరిపాటిగా మారింది. ఇన్‌స్పైర్‌కు ఎంపికైన విద్యార్థుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన తర్వాత రెడీమెడ్ ప్రాజెక్టులను కొనుగోలు చేసి మేళాలో ప్రదర్శించడం రివాజుగా వస్తోంది. కొంతమంది విద్యార్థులు మాత్రమే సొంతంగా ప్రాజెక్టులను తయారు చేసి ప్రతిభను చాటుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోకపోవడంతో విద్యార్థుల్లో సృజనాత్మకశక్తి ఉన్నప్పటికీ బయటకు ప్రదర్శించే అవకాశం లేకుండా పోతోంది. కొంతమంది తల్లిదండ్రులు ఇన్‌స్పైర్ అవార్డు డబ్బులను వాడుకుంటుండగా మరికొన్ని పాఠశాలల్లో హెచ్‌ఎంలు, ప్రాజెక్ట్ తయారు చేయించే ఉపాధ్యాయునికి డబ్బులు ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి.

జాతీయస్థాయిలో ప్రతిభ

ఏటా జిల్లా నుంచి విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. సెప్టెంబర్ 15 వరకు ఇన్‌స్పైర్ ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఉంది. సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు ముందుకొచ్చి విద్యార్థులను ప్రోత్సహించాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించాలి. ఇప్పటి వరకు నాలుగు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

– రఘురమణ, జిల్లా సైన్స్ అధికారి, ఆదిలాబాద్

క్రీడాభివృద్ధికి అన్నివిధాలుగా కృషి

- కలెక్టర్ రాజర్షి షా



హాకీ ఆడుతున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: క్రీడాభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గురువారం నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవాలకు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడా పరుగులో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం హాకీ ఫీల్డ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒలింపిక్ క్రీడల్లో పతకాల సంఖ్య పెరుగుతుండడం భారత క్రీడా రంగానికి శుభ పరిణామమన్నారు. స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు విషయంలో ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తామని, స్థానిక ఎమ్మెల్యే, అధికారుల సమన్వయంతో ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు స్టేడియంలోని స్విమ్మింగ్ ఫూల్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించేలా ప్రభుత్వానికి లేఖ పంపించామన్నారు. క్రీడా సదుపాయాలు మెరుగైతే వాటిని సద్వినియోగం చేసుకొని గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో ఉద్యోగులకు మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించేలా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో క్రీడాకారులే అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో స్పోర్ట్స్ పాలసీ గురించి జరిగిన చర్చలో విద్యార్థులందరికీ స్పోర్ట్స్ పీరియడ్ తప్పకుండా అమలు చేయాలని తాను సూచించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ విషయమై క్షేత్రస్థాయిలో అమలు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండడం హర్షణీయమన్నారు. అనంతరం ఇటీవల జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన పలువురు క్రీడాకారులకు ట్రాక్ షూస్ అందించారు. ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, శిక్షకులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాల మేరకు రుణాలివ్వాలి

కైలాస్‌నగర్: బ్యాంకర్లు నిర్దేశిత లక్ష్యాల మేరకు రైతులకు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇవ్వాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. మైక్రో క్రెడిట్ ప్లాన్, పంట రుణాల పెండింగ్, మహిళా శక్తి కార్యక్రమాలకు ఆర్థిక చేయూత వంటి అంశాలపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, డీఆర్‌డీఓ, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఆర్‌డీవో సాయన్న, డీఏవో శ్రీధర్ స్వామి, డీసీవో మోహన్, ఎల్‌డీఎం ఉత్పల్ కుమార్, మండల వ్యవసాయాధికారులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక'ఎన్నికలకు సమాయత్తం కావాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కైలాస్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సమాయత్తం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, డీపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగైదు నెలల వ్యవధిలో ఎన్నికలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. తొలుత మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు, అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, చివరగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. వాటి నిర్వహణ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకటించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి సమకూర్చుకోవాలని, పోలింగ్ సిబ్బందిని గుర్తించి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో విధులను కేటాయించే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీపీవో శ్రీలత, డివిజనల్ పంచాయతీ అధికారి ఫణీందర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాసరలో హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ అధికారులు

బాసర: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీ కానుకలను గురువారం ఆలయ అధికారులు లెక్కించారు. అక్షరాభ్యాస మండపంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. 79 రోజుల హుండీ ఆదాయం రూ.99,17,200, మిశ్రమ బంగారం 116 గ్రాములు, మిశ్రమ వెండి 4,700 గ్రాములు, విదేశీ కరెన్సీ 35 నోట్లు వచ్చాయని ఈవో విజయరామారావు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శరత్ పాఠక్ తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థాన వైదిక పరిపాలన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోలీసుల సిబ్బంది, దేవస్థాన వాగ్దేవి సొసైటీ, శివ రామ కృష్ణ భజన మండలి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

సీఎంకు బహిరంగ లేఖ



లేఖ విడుదల చేస్తున్న మానవ హక్కుల వేదిక నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన జరిగేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డికి మానవ హక్కుల వేదిక జిల్లా కమిటీ తరఫున గురువారం బహిరంగ లేఖ రాసిందని జిల్లా అధ్యక్షుడు కాంబ్లే అతీష్ కుమార్ తెలిపారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు హామీలు అమలు చేయడంతోపాటు రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గత తొమ్మిది నెలలుగా రాష్ట్రంలో ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. పోలీసు స్టేషన్‌లో దొంగతనం పేరిట బలహీన వర్గాల వారిని, మహిళలను చిత్రహింసలకు గురిచేస్తున్నారని తెలిపారు. సభ్యులు సూరజ్, రాహుల్, దివ్య, నిఖిత, మౌనిక, రజిత, సంధ్య, ఆర్తి తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కలిసిన డీసీసీ చీఫ్



డీజీపీకి బొకే అందజేస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేంద్రను హైదరాబాద్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్‌ను కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించారు.

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌ను కలిసిన 'పత్తిరెడ్డి'



శుభాకాంక్షలు తెలుపుతున్న పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డిని జెడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జలపాతాలకు నిలయమని, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించడానికి రావాలని ఆహ్వానించారు.

'కడెం' సందర్శన



ప్రాజెక్టును పరిశీలిస్తున్న అన్వేశ్‌రెడ్డి

కడెం: రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి గురువారం కడెం ప్రాజెక్టును సందర్శించారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన మరమ్మతులను పరిశీలించారు. ప్రాజెక్ట్ నీటి మట్టం, ఆయకట్టు తదితర అంశాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్, సీడ్ కార్పొరేషన్ అధికారులు, తదితరులు ఉన్నారు.

సింగరేణిలో చెత్తశుద్ధి

- రూ.1.15 కోట్లతో శ్రీరాంపూర్‌లో ప్లాంటు ఏర్పాటు
- కంపెనీలోనే మొదటిది
- రేపు డెప్యూటీ సీఎం చేతుల మీదుగా ప్రారంభం!
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



సీసీసీలో ఏర్పాటు చేసిన సింగరేణి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణ కోసం మరో ముందడుగు వేసింది. ఇన్నాళ్లు కాలనీల్లో నుంచి వచ్చే చెత్త, వ్యర్థాలను ఖాళీ ప్రదేశాల్లో పారబోసేది. దీనివల్ల నేల, గాలి, నీరు కాలుష్యమయ్యేది. దీనికి ఇక చెక్ పెట్టాలనే ఉద్దేశంతో కంపెనీ మొదటిసారిగా చెత్తను ప్రాసెస్ చేసే ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. పైలట్ ప్రాజెక్టు కింద శ్రీరాంపూర్ ఏరియా పరిధి సీసీసీలోని సీఐఎస్ఎఫ్ క్లాం ప్లెక్స్ ఆవరణలో సింగరేణి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయగా రూ.1.15 కోట్లు వెచ్చించింది. ప్లాంట్ సామర్థ్యం 25 టన్నులు కాగా, ఎకరంలో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. వేస్టేజ్ కలెక్షన్ సెక్షన్, ట్రోమల్ మిషన్, ఫట్కా మిషన్, బాయిలింగ్ మిషన్, కోకోనట్ ష్రెడ్డర్ మిషన్, యంత్రాలకు అనుసంధానం చేసే కన్వేయర్ బెల్ట్ సిస్టం పూర్తయింది.

తడి,పొడి వేరుచేసి..

శ్రీరాంపూర్ ఏరియాలోని కాలనీల నుంచి నిత్యం 20 టన్నుల చెత్తవెలువడుతుంది. ఇప్పటివరకు ఈ చెత్తను సీసీసీలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వెనుకాల ఉన్న కంపెనీ ఖాళీ స్థలంలో పారబోసేవారు. ఇక నుంచి ఈ ప్లాంట్‌కు తరలిస్తారు. ముందుగా తడి, పొడి చెత్తను వేరుచేస్తారు. వీటిని ప్రాసెస్ కోసం ప్రత్యేక యంత్రాలున్నాయి. శుద్ధీ కరణ తర్వాత వచ్చే వ్యర్థపదార్థాల నుంచి బై ప్రొడక్ట్స్‌ను తయారీకి పరిశోధనలు చేస్తున్నారు. పొడి చెత్తను యంత్రాల్లో కాల్చివాటి నుంచి ఘన రూపంలో ప్లాస్టిక్ వ్యర్థాన్ని తీస్తారు. భవిష్యత్తులో దీన్ని నుంచి ప్లాస్టిక్ టైల్స్ తయారు చేసే ఆలోచనలో కంపెనీ ఉంది. ఇక తడి చెత్త శుద్ధి తర్వాత వచ్చే వ్యర్థాల నుంచి ఏరోబిక్ కంపోస్టు తయారీకి సన్నాహాలు చేస్తున్నారు. ఈ బై ప్రొడక్ట్స్‌పై పరిశోధనల తర్వాత అప్పుడు వీటిని తయారు చేస్తారు.

రేపు డెప్యూటీ సీఎం రాక?

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్లాంట్‌ను యాజమాన్యం డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసింది. శనివారం ఆర్జీ–1 ఏరియాలో డెప్యూటీ సీఎం కార్యక్రమం ఉంది. అక్కడ నుంచి ఆయన చెన్నూర్‌లో 11 కేవీ సోలార్ ప్లాంట్ ప్రారంభానికి డెప్యూటీ హాజరవుతారు. సమయం ఉంటే అదేరోజు మధ్యాహ్నం ఈ ప్లాంట్‌ను ఆయనతో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అనుకున్న ప్రకారం డెప్యూటీ సీఎం కార్యక్రమం జరిగితే మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, ప్రజాప్రతినిధులతోపాటు కంపెనీ సీఎండీ బలరాం నాయక్, డైరెక్టర్లు యస్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, ఏరియా ఇన్‌చార్జీ జీఎం టి.శ్రీనివాస్, అధికారులు హాజరుకానున్నారు. ఇందుకోసం ఏరియా జీఎం, సివిల్ డీజీఎం ఆనంద్‌కుమార్, పర్సనల్ డీజీఎం అరవిందరావు అధికారులతో తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

హ్యాపీ స్పోర్ట్స్ డే ఆకారంలో విద్యార్థులు



బేల: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొని సందడి చేశారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులు హ్యాపీ స్పోర్ట్స్ డే ఆకారంలో కూర్చున్నారు. వైస్ ప్రిన్సిపాల్ హరికృష్ణ, పీఈటీ శివన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గిడుగు' జాతీయ సాహితీ పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న కవులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకు చెందిన నలుగురు కవులకు 'గిడుగు జాతీయ సాహితీ పురస్కారాలు దక్కాయి. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిడుగు జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ భీమేశ్‌కు కవిత్వం విభాగంలో స్వేచ్ఛకు సంకెళ్లు పుస్తకానికి, తుమ్మల దేవరావ్ రాసిన మట్టిపాదాలు కవితాసంపుటికి పురస్కారాలు దక్కాయి. గిడుగు జాతీయ కళా సేవారంగంలో నేరెళ్ల హనుమంతు, తాడిశెట్టి పరమేశ్వర్‌కు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ సాహిత్యం–వెబ్‌సైట్ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్, ప్రముఖ కవి బిక్కి కృష్ణ, తెలుగు వన్ నిర్మాత కంఠమనేని రవిశంకర్, ఆంధ్రప్రభ సంపాదకుడు వైఎస్ఆర్ శర్మ, విమల సాహితీ అధ్యక్షుడు డా.జల్ది విద్యాధర్, శంకరం వేదిక అధ్యక్షురాలు యలవర్తి ధనలక్ష్మి, ఫౌండేషన్ అధ్యక్షురాలు కాంతికృష్ణ పాల్గొన్నారు.

పర్సు పోగొట్టుకున్న మహిళ

- అప్పగించి నిజాయతీ చాటుకున్న చిరువ్యాపారి



సయ్యద్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ఎస్సైలు ప్రదీప్, గౌసుద్దీన్

భైంసాటౌన్: పట్టణానికి చెందిన ఓ మహిళ తన పర్సుతోపాటు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా కూరగాయలు విక్రయించే చిరువ్యాపారికి లభించడంతో పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. పట్టణంలోని కిసాన్‌గల్లికి చెందిన సరోజ తన భర్త సురేశ్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా, కూరగాయల మార్కెట్ వద్ద పర్సు పోగొట్టుకుంది. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సీసీ కెమెరా పరిశీలిస్తుండగా, తనకు పర్సు దొరికిందని కూరగాయల వ్యాపారి సయ్యద్ అహ్మద్ అక్కడికి వచ్చి అప్పగించాడు. రూ.14వేల నగదుతోపాటు సెల్‌ఫోన్ ఉన్న పర్సును ఎస్సైలు ప్రదీప్, ఎండీ గౌసుద్దీన్ గురువారం బాధిత మహిళకు అందించారు. నిజాయతీ చాటుకున్న చిరువ్యాపారిని సన్మానించారు.

వైన్స్ షాపుల్లో చోరీకి పాల్పడిన నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: కొన్నిరోజులుగా వైన్స్ షాపుల్లో చోరీకి పాల్పడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. వైఎస్సార్ కాలనీకి చెందిన రాఫెన్వాడ్ రఘు, ఉత్తం పాండురంగ పవర్, మక్కల శీను, జాదవ్ దిలీప్, రాపని సోనిలు కూలీ పనిచేస్తున్నారు. వాటితో వచ్చే డబ్బులతో జల్సా చేయడంతోపాటు మద్యం తాగేవారు. జల్సాలకు డబ్బు సరిపోక శ్రీ వెంకటేశ్వరరావు, సిరి వైన్స్ షాపుల్లో చోరీ చేశారు. ఈనెల 27న సాయి వైష్ణవి బార్ అండ్ రెస్టారెంట్ షటర్ తాళాలు రాడ్లతో పగులగొట్టారు. సీసీ కెమెరాలు, టీవీని ధ్వంసం చేసి, కౌంటర్‌లో రూ.40 వేల నగదు, ఒక కంప్యూటర్, కొన్ని మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. బార్ యజమాని ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీఎస్ పోలీసుల సహకారంతో 24 గంటల్లో నలుగురిని అదుపులో తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరొకరు పరారీలో ఉన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు సాయికృష్ణ, రవి, రమేశ్, కానిస్టేబుల్ తిరుపతి, గణేశ్, హోంగార్డు సతీశ్‌లను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

పక్షవాతంతో భార్యను చూడలేక భర్త ఆత్మహత్య

బోథ్: పక్షవాతంతో బాధపడుతున్న భార్యని చూడలేక మనోవేదన చెందిన భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని కనుగుట్టలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం..గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకుల నడిపెన్న(80) భార్య ఆకుల లక్ష్మి గత కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతోంది. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైంది. పక్షవాతం బారిన పడిన భార్యను చూసి కొన్ని రోజులుగా తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. పెద్ద కుమారుడు రాజేందర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన సోహెల్ ఖాన్ ఈనెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో తండ్రి ఉమర్ ఖాన్ గురువారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని పంజేషా మొహల్లాకు చెందిన తల్లి, కూతురు పిన్నంవార్ చిట్టి, మనస్వితలు బుధవారం ఇంటి నుంచి రైల్వే స్టేషన్ వైపు కాలినడకన వెళ్తున్నారు. వెనుక నుంచి ఒకరు బైక్‌పై వచ్చి ఢీకొట్టడంతో వారికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని రిమ్స్‌కు తరలించారు. ఆమె భర్త శ్రీనివాస్ గురువారం ఫిర్యాదు చేయగా, ఎస్సై విష్ణు ప్రకాశ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఖానాపూర్: పట్టణంలోని లారీఅడ్డా ప్రాంతంలో బైక్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు గురువారం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి స్వల్ప గాయంతో ఇరువురు ఒకరినొకరు విమర్శించుకొని రోడ్డుపై కాసేపు గొడవపడ్డారు. కాగా, బస్సు డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, రోడ్డు ప్రమాద బస్సు, బైక్ ఢీకొన్న చిత్రాలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. పట్టణంలోని రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతోనే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాద ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై లింబాద్రి తెలిపారు.

ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భుక్తాపూర్‌లో ఈనెల 27న రాత్రి జరిగిన దొంగతనం కేసులో మరో నిందితుడిని పోలీసులు గురువా రం పట్టుకున్నారు. అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరి మృతి

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన మునుగూరి వెంకటేశ్ (60) ప్రమాదవశాత్తు సదర్మాట్ కాలువ బ్రిడ్జి పై నుంచి పడి మృతిచెందాడు. ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం..గురువారం శివాజీనగర్–అంబేద్కర్‌నగర్ మధ్యలో గల కాలువపై రోడ్డు పక్కన బ్రిడ్జిపై వెంకటేశ్ కూర్చున్నాడు. ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడు. గమనించిన కాలనీవాసులు అతన్ని బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి అన్నకుమారుడు భూమేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గోవింద్ సర్కార్(24) బతుకుదెరువు కోసం నిర్మల్ జిల్లాకు వచ్చాడు. కూలీగా వరినాట్లు వేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 23న వరినాట్ల డబ్బుల కోసం బైక్‌పై కడెంకు వెళ్లి తిరిగివస్తున్నాడు. లక్ష్మణచాంద మండలం నర్సాపూర్–ఒడ్డెపెల్లి జాతీయ రహదారి పక్కన మొక్కజొన్న కంకులు కొనుగోలు చేస్తుండగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. క్షతగాత్రుడిని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ ఇప్ప ముత్యంరెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ముత్యంరెడ్డి

నిర్మల్‌ఖిల్లా: భవన నిర్మాణ, ఇతర అసంఘటితరంగ కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక, సామాజిక భద్రతను పొందాలని ఆదిలాబాద్ జిల్లా కార్మిక శాఖా సహాయ కమిషనర్ ఇప్ప ముత్యంరెడ్డి సూచించారు. భవన నిర్మాణరంగం, ఫారెస్ట్, బీడీ కార్మికులకు కార్మిక చట్టాలు, సామాజిక భద్రత పథకాలపై పీఎం విశ్వకర్మ కేంద్రంలో శిక్షణ పొందుతున్న పలు రంగాల కార్మికులకు గురువారం ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణరంగ కార్మికులకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పని ప్రదేశాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని, తప్పని సరిగా లేబర్ బోర్డ్ నుంచి గుర్తింపు కార్డును కలిగి ఉండాలని తెలిపారు. నిర్మల్ సహాయ కార్మిక అధికారి రాజలింగం మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం కేంద్రం ఇప్పటికే ఈ శ్రమ్ పథకం, మన్‌దన్ యోజన అమలు చేస్తోందని తెలిపారు. కనీస వేతనాల అమలుకోసం చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భైంసా సహాయ కార్మిక అధికారి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలన కోసం అందరూ కలిసి రావాలన్నారు. ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వదేశ్ పరికిపండ్ల మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లా నుంచి కార్మికులు దుబాయ్, మస్కట్, ఖాతార్, కువైట్, సౌదీ అరేబియా, బహ్రెయిన్‌కు వలస వెళ్తున్నారన్నారు. విదేశాలకు వెళ్లేవారు ముందుగా శిక్షణ పొంది, లేబర్ కాంట్రాక్ట్ ప్రకారం వేతన సౌకర్యాలు, కంపెనీ వివరాలు పక్కాగా తెలుసుకుని వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ ట్రైనింగ్ మేనేజర్ మోతె రాజు, దుర్గం శ్రీకాంత్, యూనియన్ నాయకులు కొమ్ము గీత, తాళ్ల సంజీవ్, శిక్షణ పొందుతున్న కార్మికులు పాల్గొన్నారు.

నెమలిని కాపాడిన రైతు



అటవీఅధికారులకు నెమలిని అప్పగిస్తున్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్ శివారులో జాతీయ పక్షి నెమలిని కుక్కలు గురువారం రాత్రి వెంబడించాయి. రైతు సురుకుంట వినోద్‌రెడ్డి గమనించి కాపాడాడు. గాయపడిన నెమలి గురించి వీడీసీ అధ్యక్షుడు వెంకట్‌కు వివరించాడు. స్పందించిన ఆయన అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎఫ్ఎస్‌వో అలేఖ్య, ఎఫ్‌బీవో సాయరెడ్డిలు నెమలికి ప్రాథమిక చికిత్స అనంతరం అటవీప్రాంతంలో వదిలేశారు. నెమలిని కాపాడిన రైతును అటవీ అధికారులు అభినందించారు.

క్రీడాకారుడికి ప్రశంస..

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకు చెందిన క్రీడాకారుడు జాదవ్ ఉమేశ్ జాతీయస్థాయి క్రికెట్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఉమేశ్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రశంసాపత్రం, మెమొంటో అందించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ

భైంసారూరల్: కుటుంబ నిర్ధారణ, రేషన్‌కార్డు, ఇతర కారణాలతో రూ.2 లక్షల లోపు రుణమాఫీకాని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.మండలంలోని హంపోలి క్లస్టర్ పరిధిలో రైతువేదికలో ప్రత్యేక కార్యక్రమం గురువారం ఏర్పాటుచేశారు. రుణమాఫీ వర్తించని రైతులు ఇచ్చిన ఫిర్యాదులను తీసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఏడీఏ వీణ రైతువేదికకు వచ్చి రైతులతో మాట్లాడారు. నోడల్ అధికారుల ఆధ్వర్యంలో రైతుల ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. 50 మందికిపైగా రైతులు ఫిర్యాదులు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు



గాయపడ్డ విద్యార్థి

బోథ్: సొనాల గ్రామంలో గు రువారం కుక్కల దాడిలో పలువురికి గాయాలయ్యాయి. నర్సయ్య, ఓ యువకుడితోపాటు పలువురిపై కుక్కలు దా డి చేసి గాయపర్చాయి. వారిని వెంటనే సొనాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి, పలువురిని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

భీంరావు సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అభివృద్ధికి మాజీ మంత్రి కోట్నాక్ భీంరావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని భీంరావు చౌక్ వద్ద మాజీమంత్రి కోట్నాక్ భీంరావు వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. భీంరావు..ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలి గిరిజన శాఖమంత్రిగా పనిచేసి ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి కృషిచేశారని పేర్కొన్నారు. ఐటీడీఏతో పాటు గిడ్డంగులు ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. 33 ఏళ్ల తర్వాత ఆయన స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చి ఈప్రాంత ప్రజల ఆశీర్వాదంతోనే ఎమ్మెల్యేగా గెలిచానని పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ఐటీడీఏ, ఆశ్రమ పాఠశాలల ఏర్పాటుకు భీంరావు కృషి చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్, ఆత్రం భాస్కర్, కోట్నాక్ రమేశ్, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, విశంరావు, జిల్లామేడి దుర్గ పాల్గొన్నారు.

టీజీ సీడ్స్‌నే కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేశ్‌రెడ్డి

భైంసారూరల్: రైతులు టీజీ సీడ్స్‌నే కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వానల్‌పాడ్ రైతు వేదికలో ఆగ్రో డీలర్స్‌తో సమావేశం గురువారం ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రా నున్న యాసంగి సీజన్‌లో ఈ ప్రాంతంలో రైతులు టీజీ సీడ్స్ తయారు చేసి శెనగలు, వడ్లు కొ నుగోలు చేసేలా చూడాలన్నారు. టీజీ సీడ్స్ వి త్తనాలు నాణ్యమైనవిగా ఉంటాయని రైతుల కు అందుబాటు ధరల్లోనే విక్రయిస్తారని తెలి పారు. తెలంగాణ వ్యవసాయ వాతావరణానికి అనుగుణంగా రైతులకు అధిక దిగుబడులు ఇచ్చే పంట రకాలను ఉత్పత్తిచేసి ఆగ్రో డీలర్స్‌తో విక్రయిస్తున్నట్లు తెలిపారు. రైతుల సౌకర్యార్థం అన్ని మండలాల్లోని పీఏసీఎస్, డీసీ ఎంఎస్‌తోపాటు ప్రభుత్వరంగ డీలర్స్ వద్ద ఈ విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపా రు. విత్తన శుద్ధి చేసి ప్లాంట్లలో ప్యాకింగ్ ప్రాసెస్ నిపుణుల సమక్షంలోనే జరుగుతుందని పే ర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఏడీఏ వీణ, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, మాజీ ఎంపీపీ రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవసరమైన వనరులు అందిస్తాం



కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు

భైంసా: ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు అవసరమైన వనరులు అందిస్తామని వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో గురువారం ఇన్వెంటస్ క్యాపిటల్ పార్ట్‌నర్స్, కాకతీయ సాండ్‌బాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. (కేఆర్ఈఎస్‌టీ) కన్వల్‌రేఖి రూరల్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ స్టార్టప్ సెంటర్ ఆధ్వర్యంలో ఆగస్టు 10 నుంచి నిర్వహిస్తున్న కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఉత్తర తెలంగాణకు చెందిన యువ విద్యార్థులు ఏడు బృందాలుగా ఏర్పడి తమ స్టార్టప్ ఆలోచనలను ప్యానెళ్లకు అందజేశారు. పవన్‌కుమార్, గణేశ్ పాండ్రా మిసా, సందీప్, వినోద్, సూర్యరాజ్ విద్యార్థుల బృందానికి ప్రథమ బహుమతి కింద రూ. 25వేలు, ఆదిత్య, తనుశ్రీ, సింధూజ, స్వర్ణలత కాన్సెప్ట్‌కి రూ.20వేల బహుమతి, శ్రవంత్, శ్రీపార్థరెడ్డి, సయ్యద్ సాహిద్, సర్వేశ్ విద్యార్థులకు తృతీయ బహుమతి రూ.15 వేలు అందించారు.